క్లుప్తంగా

డిమాండ్ల సాధనకు రిలే దీక్షలు



రిలే దీక్షలలో పాల్గొన్న ఎన్‌ఎంయూ నాయకులు

చీరాల అర్బన్: ఆర్టీసీ సంస్థలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలలో డీఎంఆర్ రావు, డీ బాబూరావు, వై.శ్యామ్, ఎం.రాజ్యలక్ష్మి, కే సురేంద్ర, ఎస్.నాగరాజులు కూర్చొన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి తులసి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ వెంటనే అమలు చేయాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలన్నారు. గత నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. రెండు రోజులు పాటు రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులతో ఉపయోగం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు

చీరాల అర్బన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయానికి వెళ్లి వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మ్యాగజైన్లు వంటివి ఎన్నో ఉంటాయన్నారు. గ్రంథపాలకురాలు డి.ధనమ్మ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, పదోతరగతి లోపు విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా హాజరుకావాలన్నారు. అనంతరం విద్యార్థులచే చెస్, క్యారం బోర్డు, మొదలైన ఆటలను నిర్వహించారు.

చెత్త సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి

యద్దనపూడి: గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి చెత్తగా, పొడి చెత్తగా వేరుచేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువును తయారు చేసి సంపద సృష్టించుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి కుమారస్వామి సూచించారు. సోమవారం మండలంలోని పూనూరు గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ నెలాఖరు కల్లా చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ చెత్త సేకరించే సమయంలో చేతికి గ్లౌజులు, మాస్కులు, బూట్లు ధరించి చెత్తను సేకరించాలని సూచించారు. సంపద కేంద్రం చుట్టూ మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజు, మాజీ సర్పంచ్ బోయపాటి సాంబశివరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్లలో నేరాల కట్టడికి విస్తృత తనిఖీలు



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ ఎస్సై కొండయ్య

చీరాల రూరల్: రైలు బండ్లు, రైల్వే ప్లాట్‌ఫారంలపై ఎటువంటి నేరాలు జరగకుండా నిత్యం తనిఖీలు చేపడుతూ ప్రయాణికులకు భద్రత కల్పిస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్. కొండయ్య తెలిపారు. ఆదివారం రాత్రి ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది చీరాల రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, పలు రైళ్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫారంపై అనుమానంగా సంచరించే వ్యక్తులను నిశితంగా పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. అలానే రాత్రి సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులను ఎక్కడి నుంచి వస్తున్నారనే విషయాలను అడిగి వారి బ్యాగులను తనిఖీలు నిర్వహించారు. కొత్తగా అనుమానంగా ఎవరు కనిపించినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

చిన్న జాగ్రత్త.. పశువులకు పెద్ద రక్ష

- వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ఉదయం, సాయంత్రం వేళల్లోనే మేతకు వదలాలని సూచన
- నియోజకవర్గంలో 72 వేల పశువులు



వైద్య శిబిరం వద్దకు వచ్చిన పశువులు (ఫైల్)

అద్దంకి: వేసవిలో నమోదయ్యే అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు వివిధ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటుంటాయి. సహజంగా 18 డిగ్రీల నుంచి 30 డిగ్రీల వరకు వేడిమిని పశువులు తట్టుకోగలుగుతాయి. ఆపైన ఉష్ణోగ్రతలు నమోదైతే పశువుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యనిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 72 వేలకు పైగా పశువులు ఉన్నాయి. వేసవి కారణంగా అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదవుతుండడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులు పశువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య నిపుణుడు ఏడీ డాక్టర్ మోహనరావు సూచిస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా..

సాధారణంగా పాడి రైతులు పశువులను మేత కోసం అడవులకు పొలాలకు తోలుకెళ్తుంటారు. వేసవిలో అలా చేయడం వల్ల అధిక వేడికి పశువులు వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల పూర్తిస్థాయిలో తాగునీరు లభించకపోవడం వల్ల ఇలా జరుగుతుంటుంది. ఈసమయంలో పశువులు వడదెబ్బకు గురికావడంతో శ్వాస తీసుకోలేకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, నాడి అధికంగా కొట్టుకోవడం వంటివి సంభవిస్తాయి. కొన్ని సమయాల్లో పశువు అపస్మారక స్థితికి చేరుకుని మరణించే ప్రమాదం కూడా ఉంది. ఇలాంటి లక్షణాలను రైతు పశువులో గమనించిన వెంటనే వడదెబ్బ తగిలిందని గుర్తించాలి. వెంటనే పశువును చల్లటి ప్రదేశాలకు తీసుకెళ్లాలి. షెడ్డు చుట్టూ గోనె సంచులను తడిపి కట్టాలి. శరీరాన్ని చల్లని నీటితో కడగాలి. అనంతరం పశువైద్యుడికి సమాచారం అందించి తగిన చికిత్స చేయించాలి. వేసవి కాలంలో ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు మాత్రమే పశువును మేతకు వదలాలి. వేసవిలో షెడ్డుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలి.

వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది..

వేసవి కాలంలో పొలంలో సరిపడా నీరు దొరకదు. దాంతో పోషకాహార లోపం ఏర్పడుతుంది. దీని కారణంగా పశువుకు గాలికుంటు, గొంతు వాపు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఇలాంటి ప్రమాదాలు తలెత్తకుండా పశువులకు ముందుగానే టీకాలు వేయించుకోవాలి. అంతర, బాహ్య ప్రధాన జీవుల నివారణ కోసం నట్టల నివారణ మందును వేయించుకోవాలి. పరిశుభ్రమైన ఆహారాన్ని తగు మోతాదులో నీరు అందించి వేసవిలో వేడి తగలకుండా జాగ్రత్త వహిస్తే పశువులు ఏ వ్యాధికి గురికాకుండా ఉంటాయని చెప్తున్నారు.

వేసవిలో జాగ్రత్తలతో పశుసంరక్షణ..



వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దాంతో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడం సహజం. అయితే పశువులను మేపే సమయంలో మార్పులు చేసుకోకపోతే వాటికి మనుషుల వలె వడదెబ్బ సోకే ప్రమాదం ఉంది. పాడి రైతులు పశువులు ఎక్కువగా నీరు తీసుకునేలా చూడాలి. షెడ్డు చుట్టూ గోనె సంచులు తడిపి కడితే మంచిది. పగటి పూట పచ్చిగడ్డి దాణా మిశ్రమాన్ని, రాత్రి సమయంలో ఎండు గడ్డిని ఇస్తే పశువుకు పోషకాహార లోపం తలెత్తకుండా ఉంటుంది.

– ఏడీ మోహనరావు, అద్దంకి

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: పార్టీ బలోపేతానికి కృషిచేయాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన స్థానం లభిస్తుందన్నారు. త్వరలో బూత్ కమిటీ సభ్యులను ఏర్పాటు చేయాలని స్థానిక నేతలకు సూచించారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు సంవత్సరం కావస్తున్నా ఇక్క హామీ నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలను నమ్మి మోసపోయామని మహిళలు భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ మెరిట్ విద్యార్థినులకు అభినందనలు



సాహితిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



హరితను సత్కరిస్తున్న నాగమల్లేశ్వరరావు, సురేంద్ర

చినగంజాం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 584 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానం సాధించిన మాచవరపు సాహితిని పలువురు అభినందించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఆమెను శాలువాతో సత్కరించి చిరు కానుకను ప్రోత్సాహకంగా అందజేశారు. మండలంలోని మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన మరో పూర్వ విద్యార్థి గునివిని నాగార్జునరెడ్డి కుమార్తె గునివిని హరిత 587 మార్కులు తెచ్చుకోవడంతో ఆమెను కూడా శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు సిద్ధం నాగమల్లేశ్వరరావు, వేదాల ఫణి, ఖాదర్ బాషా, చాట్ల సురేంద్ర, నబీషా, రామాంజనేయులు, అమీర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఎరువుల తగ్గింపు



భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

జే పంగులూరు: వేసవిలో తప్పనిసరిగా భూసార పరీక్షలు తప్పనిసరి చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం, కొండమూరు గ్రామాల్లో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనాలను సేకరించి భూ పరీక్షలకు పంపించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం వలన భూమిలో మొక్కకు కావాల్సిన పోషకాలు అనేవి ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. ఏ పంట వేసుకుంటే ఆ పంటకు కావాల్సిన ఎరువులు, వాటి ఎంత మోతాదులో వాడాలో కూడా పరీక్షలు వలన తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

రోడ్డు మార్జిన్‌లోకి కంటైనర్



మార్జిన్‌లో పడిన కంటైనర్

మార్టూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఓ కంటైనర్ జాతీయ రహదారి పక్కన మార్జిన్‌లోకి దూసుకెళ్లిన ఘటన మార్టూరు సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. చిలకలూరిపేట వైపు నుంచి చెన్నై వెళ్తున్న ఓ కంటైనర్ స్థానిక రాజుపాలెం కూడలి సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తు కారణంగా పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

బీడు భూముల సర్వేకి ప్రత్యేక బృందాలు



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి అలేఖ్య

వేటపాలెం: బీడు భూముల సర్వే కోసం మండల, గ్రామాల పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు ఉద్యానశాఖ అధికారిణి అలేఖ్య తెలిపారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యాన శాఖ, ఏపీఎస్‌ఆర్‌ఈ జీఎస్ డిపార్టుమెంట్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయానికి పనికిరాని భూములను గుర్తించి ఆ భూముని ఉద్యాన పంటలు వేయడానికి, సాగు విధానంలోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీవో దాసు మాట్లాడుతూ ఉద్యాన సాగు కింద 25 రకాల పండ్ల మొక్కలను, మునగ, మల్లి, గులాబీ మొక్కలను వంద శాతం రాయితీపై ఉపాధి హామీ పథకం కింద ఇస్తారని తెలిపారు. వేటపాలెం మండలానికి 40 ఎకరాల ఈ పథకం కింద రైతులు వేసుకోవడానికి అవకాశం కల్పించారని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాజేష్ మాట్లాడుతూ బీచ్ ఎదురుగా ఉన్న స్థలంలో మొక్కలు నాటించాలన్నారు. ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ ఈ నెల ఆఖరి లోపు బీడు భూములు గుర్తింపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో

బల్లికురవ: ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఫోర్‌వీల్ ఆటో ఢీకొట్టటంతో డ్రైవర్ క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం తెల్లవారుజామున నార్కెట్‌పల్లి– మేదరమెట్ల నామ్ రహదారిలో మండలంలోని కొప్పరపాడు చర్చి సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి చెన్నై వెళుతున్న లారీ డ్రైవర్ మార్జిన్‌లో ఆపాడు. ఈక్రమంలో తమిళనాడు వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో లారీని వెనుక వైపు ఢీకొట్టటంతో క్యాబిన్ నుజ్జునుజ్జయింది. డ్రైవర్, క్లీనర్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి



ఫుట్‌బాల్ శిక్షణా శిబిరానికి హాజరైన క్రీడాకారులు

చీరాల రూరల్: శిక్షణ శిబిరంలో శిక్షకులు ఇచ్చిన మెళకువలను నేర్చుకుని భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య సారథ్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఫుట్‌బాల్ శిక్షణా శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు స్థానిక ఎన్‌ఆర్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా శిబిరాన్ని నిర్వహిస్తున్న ప్రేమయ్యను ఆయన అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ, సెక్రటరి చారుగుళ్ల గురుప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతిఏడాది తన సొంత డబ్బులు వెచ్చించి 100 మంది క్రీడాకారులకు పౌష్టికాహారంతో పాటు శిక్షణా శిబిరానికి హాజరైన క్రీడాకారులకు టీషర్టులు ఇవ్వడం సంతోషకరమన్నారు. తమవంతు సాయంగా క్రీడాకారుల పౌష్టికాహారానికి వారు రూ. 2,000 నగదు అందజేశారు. క్యాంప్ ఇన్‌చార్జ్ ప్రేమయ్య మాట్లాడుతూ మే నెల 31 వరకు క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్‌లు నరేష్, ప్రసన్న కుమార్, రమ్యకుమార్, తైక్వాండో కోచ్ సలావుద్దీన్‌లు పాల్గొన్నారు.

పిల్లల చట్టాలపై అవగాహన అవసరం



చినగంజాంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



వేటపాలెంలో మాట్లాడుతున్న శ్రీప్రియ

వేటపాలెం: పిల్లల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి జీ శ్రీప్రియ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో యాక్ట్ గురించి తెలియజేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కి సమాచారం ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: సమాజంలో ప్రతి ఒక్కరూ బాల్యవివాహాలు, బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ సుభద్ర అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కిశోరి బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీహర్ష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఆయా గ్రామాల మహిళా పోలీసులు,అంగన్‌వాడీలు,ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

చినగంజాం: బాల్యవివాహాలను నివారించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఏ శ్రీనివాసమూర్తి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం కిశోర్ బాలికల వేసవి శిక్షణా కార్యక్రమం నిర్వాహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు కే వాణిశ్రీ, ఎస్ సుమలత, కే ఉషాకుమారి, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఓఏలు పాల్గొన్నారు.


వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



సూచనలు ఇస్తున్న వైద్యులు

జే పంగులూరు: వేసవిలో ఎండలు మండుతుండటంతో మండల ప్రజలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు శివచెన్నయ్య అన్నారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో గ్రామస్తులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, మంచి నీరు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఉదయం 11 గంటల్లోపు పనులు పూర్తి చేసుకోవాలని, సాయంత్రం నాలుగు గంటల అనంతరం బయటకు రావాలని తెలిపారు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలన్నారు. ఎవరికైన అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామంలోని ఆరోగ్య కార్యకర్తలను, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హరిబాబు, ఏఎన్ఎం రేణుక, సీహెచ్‌ఓ మార్తా, 104 సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి మహా ప్రభో !



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

చీరాల టౌన్: నెలల తరబడి జీతాలు రాక అష్టకష్టాలు పడుతున్నాం... మాకు జీతాలు ఇప్పించి ఆదుకోండయ్యా అంటూ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు వసంతరావు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 6 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెండింగ్ జీతాలు, యూనిఫారాలు వెంటనే అందించాలని లేకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో శివసుబ్రమణ్యంకు వినతిపత్రాన్ని అందించారు.

చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట వేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్, రైతులు

బల్లికురవ: ఈర్లచెరువును ఆక్రమించి గ్రానైట్ క్వారీ నిర్వహకులు రోడ్డు వేయిస్తున్నారని.. ఆక్రమణలతో చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని నక్కబొక్కలపాడు గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య, నీటి సంఘం అధ్యక్షుడు దర్శి రామస్వామి రైతులు సోమవారం తహసీల్దార్ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొణిదెన రెవెన్యూలోని నక్కబొక్కలపాడు ఈర్ల చెరువు కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, కొత్తమల్లాయ పాలెం, పాతమల్లాయపాలెం, కొణిదెన గ్రామానికి చెందిన సుమారు 12 వందల ఎకరాల ఆయకట్టులో ఉందని రైతులు తెలిపారు. ఇటీవల కాలంలో చెరువును కొందరు ఆక్రమించుకోవటంతోపాటు చెరువు మధ్య భాగంలో గుండా రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని తక్షణమే పనులు నిలుపుదల చేయించాలని తహసీల్దార్‌కు వివరించారు. చెరువు ఆక్రమణలతో నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయి పంట భూములకు నీరందడం లేదని చెప్పారు. తక్షణమే రికార్డు ప్రకారం కొలతలు వేసి ఆక్రమణకు చెక్ పెట్టటంతో పాటు రోడ్డు వేసేవారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

కుంభాభిషేకం ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రికను గ్రామ దేవతలకు సమర్పిస్తున్న ఏసీ

అద్దంకి రూరల్: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేక ప్రథమ ఆహ్వాన పత్రికను క్షేత్రాధిపతి శ్రీలక్ష్మీ నరసింహస్వామికి అందించారు. అలాగే గ్రామదేవత అయిన పోలేరమ్మ అమ్మవారికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. తిమ్మనాయుడు సోమవారం మంగళవాయిద్యాలతో వెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి

బల్లికురవ: మహిళలు కుట్టుశిక్షణను సద్వినియోగపరుచుకుంటే స్వశక్తితో జీవించవచ్చని ఎంపీడీవో కుసుమ కుమారి పేర్కొన్నారు. సోమవారం బల్లికురవలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. మిషన్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. మండలంలోని శిక్షణకు నమోదుచేసుకున్న 144 మందికి రెండు బ్యాచ్‌లుగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తామని శిక్షణలో నిష్ణాతులైతే మిషన్లు అందజేస్తామని ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ పావులూరి నవ్య, శిక్షణ ప్రతినిధులు సుబ్రమణ్యం, రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

వంద మందికి ఉపాధి కల్పించాలి

అద్దంకి: ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం వంద మందికి ఉపాధి హామీ పని కల్పించాలని ఎంపీడీవో శింగయ్య అన్నారు. మండలంలోని ఐదు గ్రామాల్లో ఉపాధి పని తక్కువ మంది చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఆయా పంచాయతీల్లో కనీసం 100 మందికి తగ్గకుండా పని కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి ఉపాధి పనులపై అవగాహన కూడా కల్పించాలన్నారు. ఎవరైనా పని కావాలనుకునే వారు ఉంటే వెంటనే ఎంపీడీవోని సంప్రదించాలని కోరారు.